క్లుప్తంగా

కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి చిరంజీవి

ఎమ్మిగనూరురూరల్: వచ్చే నెల 4వ తేదీన జరిగే ఎన్నికల కౌంటింగ్‌కు వచ్చే ఏజెంట్లు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి చిరంజీవి సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో కౌంటింగ్‌కు వెళ్లే ఏజెంట్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రానికి ముందుగానే హాజరుకావాలని, జారీ చేసిన పాస్‌లను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. నియోజకవర్గంకు సంబంధించి 20 రౌండ్లు ఉంటాయని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్ ఫోన్ అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎటువంటి పొరపాట్లు లేకుండా కౌంటింగ్ ప్రక్రియ జరిగేల అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ



పరీక్ష కేంద్రం వద్ద సిట్టింగ్ స్క్వాడ్ అధికారిణి శోభారాణి

కోసిగి: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను మంగళవారం సిట్టింగ్ స్క్వాడ్ అధికారిణి శోభారాణి తనిఖీ చేశారు. పాఠశాలలో పదో తరగతి మ్యాథ్స్ పరీక్షకు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలకు సంబంధించి 252 మందికి గాను 184 మంది హాజరు కాగా 68 మంది గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు. పరీక్షల చీఫ్ ఖలీల్ అహ్మద్, డిపార్ట్‌మెంట్ అధికారి సుధాకర్ ఉన్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

మంత్రాలయం : ఎన్నికల కౌటింగ్‌లో అభ్యర్థులు, ఏజెంట్లు, అధికారులు ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.మురళీ, డీఎస్పీ సీతారామయ్య సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్స్‌లతో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ అభ్యర్థులు, సిట్టింగ్ ఏజెంట్స్, ఫ్లైయింగ్ ఏజెంట్లకు కేటాయించిన స్థానాల్లోనే కౌంటింగ్ చూసుకోవాలన్నారు. కౌంటింగ్ హాల్‌లో గొడవ పడడం, అల్లర్లు సృష్టించాలని చూస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐలు ప్రసా ద్, ఎరిసావలి, ఎస్‌ఐలు గోపినాథ్, కృష్ణమూర్తి, ఆయా పార్టీ అభ్యర్థుల ఏజెంట్లు పాల్గొన్నారు.

ప్రతి సంస్థ వేసవి పాఠశాల నిర్వహించాలి



భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

కౌతాళం: ప్రతి స్వచ్ఛంద సంస్థ వేసవి పాఠశాల నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు దాట్ల యూత్ నాయకులు దాట్ల సుబ్బారాజు, రాఘువేంద్రరెడ్డి, గణపతిరాజు అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలో పాస్టర్ రెవరెండ్ నందకుమార్, పాస్టర్ సతీష్ ఆధ్వర్యంలో వేసవి కాలపు బైబిల్ స్కూల్ నిర్వహిస్తున్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దాట్ల యూత్ ఆధ్వర్యంలో మంగళవారం విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు భోజనాలను వడ్డించారు. కార్యక్రమంలో వీరేశప్ప, కుమార్‌రాజు, సత్యగౌడ్, ఉలిగయ్య, ఉపేంద్ర, జగదీష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

లోన్ యాప్‌లను నిషేధించాలి

ఎమ్మిగనూరుటౌన్ : అధిక వడ్డీలకు ఆన్‌లైన్‌లో లోన్లు ఇవ్వజూపుతూ మోసాలకు పాల్పడుతున్న లోన్ యాప్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరం నిషేధించాలని నేషనల్ యాంటి కరప్షన్ అండ్ ఆపరేషన్ కమిటీ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఈరన్న, ఆ సంఘ నాయకులు సూర్యప్రకాష్‌రావు, మల్లికార్జునరావు కోరారు. మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో లోన్లు తీసుకొని విద్యార్థులు, యువకులు మోసపోతూ ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారన్నారు. తాడేపల్లిగూడెంలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ఆన్‌లైన్ లోన్ యాప్ ద్వారా రుణం తీసుకొని వారి వేధింపులతో ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఆన్‌లైన్‌లో రుణాలు ఇచ్చి అధిక వడ్డీలు వేసి వాటి రికవరీకై తీవ్రమైన వేధింపులకు పాల్పడుతుండటంతో రుణాలు తీసుకున్న వారు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఏర్పడుతుందన్నారు.

మహాయోగి లక్ష్మమ్మ అవ్వ ఎందరికో చైతన్య దీప్తి.. మరెందరికో స్ఫూర్తిప్రదాత.. ఇంకెందరికో మహిమలు చూపిన మాతృమూర్తి.. అన్నింటికీ మించి కోరిన భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారం అవ్వ. ఈనెల 30న అవ్వ జాతర. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి కూడా భక్తులు రానుండటంతో ఆలయ నిర్వాహకులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. – ఆదోని అర్బన్







బంగారంతో తయారు చేసిన అవ్వవారి విగ్రహం,గర్భగుడికి బంగారు తొడుగు, లక్ష్మమ్మవ్వ మూలవిరాట్

కొలిచేవారికి కొంగుబంగారం..

- చెత్తకుండీనే ఆవాసం చేసుకుని మహిమలు చూపిన తిక్క లక్ష్మమ్మ
- భక్తుల కోరిన కోర్కెలు తీర్చి మహాయోగి లక్ష్మమ్మ అవ్వగా ప్రసిద్ధి
- రేపు అమ్మవారి జాతర
- తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

దళితుల ఇంట లక్ష్మమ్మగా పుట్టి..
ఆలూరు మండలం మూసానహళ్లి గ్రామంలో దళితులు మంగమ్మ, బండెప్ప దంపతులకు ఆడ బిడ్డ జన్మించింది. లక్ష్మమ్మగా పేరు పెట్టుకున్నారు. అయితే ఆ బాలిక చిన్నప్పటి నుంచే విచిత్రంగా ప్రవర్తిస్తూ ఉండటం, ఎవరితో మాట్లాడకుండా మౌనంగా ఉండటంతో గ్రామస్తులు తిక్కమ్మగా పిలిచేవారు. పెళ్లీడు రావడంతో తల్లిదండ్రులు కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప గ్రామానికి చెందిన యువకుడు మారెప్పకు ఇచ్చి వివాహం చేశారు. ఓ రోజు ఆమె తన భర్తకు శక్తిస్వరూపిణిగా కనిపించడంతో అతడు భయపడి ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీశాడు. స్థానికులు అక్కడికి చేరుకుని ఆమెకు తిక్క ఉందని ముద్ర వేశారు. కొన్ని రోజుల తర్వాత సిరుగుప్ప నుంచి వాహనంలో ఆదోనికి చేరుకుంది. చెత్తకుండీ పక్కనే కూర్చొని చెత్తను తలపై చల్లుకుని వికారంగా ఉండేది. కానీ ఎవరినీ ఏమీ అనేది కాదు.

మహిమలు చూపి.. మహాయోగిగా ప్రసిద్ధి
ఒకరోజు రాత్రి ఓ కానిస్టేబుల్ అటుగా వెళ్తున్నాడు. చెత్తకుండీ పక్కన ఉన్న మహిళ ఒక్కసారిగా తన శరీరాన్ని నాలుగు భాగాలుగా చీల్చుకుంది. అది చూసి భయపడిపోయిన కానిస్టేబుల్ స్టేషన్‌కు పరిగెత్తి సీఐకు చెప్పాడు. వారిద్దరూ అక్కడకు చేరుకోగా మహిళ యథావిధిగా ఓ మూలన పడుకుని కనిపించింది. ఇలా తరచూ ఆమె రకరకాల మహిమలు చూపుతుండటంతో మహాయోగిగా భావించి సమస్యలు చెప్పుకుని సాంత్వన పొందటం ప్రారంభించారు. ఆమె దుకాణాల వద్దకు వచ్చిపోతే వ్యాపారం బాగా సాగుందనే నమ్మేవారు. సంతానం లేనివారికి అమ్మవారిని కలిసి వేడుకుంటే సంతానం కలిగేదని భక్తుల నమ్మకం. రోజురోజుకూ మహిమలు చూపడం ఎక్కువ కావడంతో తిక్క లక్ష్మమ్మను మహాయోగి తిక్కలక్ష్మమ్మగా పిలిచేవారు.

రేపు రథోత్సవం
ఈనెల 30న (గురువారం) అమ్మవారి జాతర సందర్భంగా వెండి రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అదే రోజు తెల్లవారుజామున అవ్వవారి సమాధి, మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, పట్టువస్త్రాలు, ఒడిబియ్యం, పూల అలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్నదాన వితరణ ఉంటుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి అవ్వ విగ్రహాన్ని వెండి రథంలో ఉంచి పురవీధుల గుండా ఊరేగించనున్నారు.

- భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయం చుట్టూ క్యూలైన్ కోసం టెంట్లు, బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆలయం ముందు మేర చలువ పందిళ్లు వేశారు. అమ్మవారిని కొలువుదీర్చే మండపాన్ని, ఆలయ సమీపంలోని రోడ్లకు విద్యుద్దీపాలతో అలంకరించారు. మందిరం స్తంభాలను బంగారం తొడుగుతో తీర్చిదిద్దారు.
- డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును నిర్వహిస్తున్నారు.



వెండి రథం

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశాం. భక్తులకు, అందరికీ అన్నదానం నిర్వహిస్తున్నాం. మూడు గంటలకు వెండి రథోత్సవ కార్యక్రమం ఉంటుంది. శ్రీభగవాన్‌శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో అవ్వ వారి పేరుమీద ఉచితంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు యోగా సాధన, ధ్యానం, సంగీతం, కుట్టుశిక్షణ, భరతనాట్యం, కూచిపుడి, సంస్కృతి, సత్సంగాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహిస్తున్నాం. రథోత్సవం గురువారం రోజు అంగరంగ వైభవంగా జరుపుతున్నాం. చుట్టుపక్క గ్రామాల వారు, కొత్త జంటలు అవ్వవారిని దర్శించుకుంటారు.
– రాచోటి రామయ్య, ఆలయ ధర్మకర్త



అవ్వవారి గర్భగుడి గోపురం

1933లో జీవసమాధి



అవ్వకు రాచోటి రామయ్య వంశీయులతో పాటు చాకలి నరసప్ప అమ్మవారిని ఆశ్రయించి దగ్గరుండి సేవలు చేసేవారు. అమ్మవారు జీవించిన కాలంలోనే ఓ పెద్ద కుర్చీలో ఉంచి పల్లకీసేవగా ఊరేగించేవారు. 1933లో జీవసమాధి అయ్యిందని ఆలయ నిర్వాహకులు, అవ్వ బ్యాంకు సీఈఓ గట్టు మురళీకుమార్ చరిత్రను వివరించారు. రాచోటి రామయ్య వంశీకులు అక్కడ గుడి కట్టించారని, అవ్వ గుడి కింద జీవసమాధి వద్ద ధ్యానం చేసిన వారికి మంచి జరిగేదని మురళీకుమార్ తెలిపారు.

నేడు ఉలిగమ్మ అవ్వ రథోత్సవం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సోగనూరు గ్రామంలో బుధవారం శ్రీ ఉలిగమ్మ అవ్వ రథోత్సవం జరగనున్నట్లు గ్రామ పెద్దలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతరలో భాగంగా మంగళవారం సాయంత్రం దేవాలయం ముందు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

90 శాతం రాయితీ ఇవ్వాలి

నందవరం : ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు 90 శాతం రాయితీతో విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్ అక్బర్ బాషాకు ఏపీ రైతు సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు జింక్, సల్ఫేట్, పచ్చిరొట్ట ఎరువులు, మినుములు, పెసర విత్తనాలను ఉచితంగా అందిచాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదకర్శి గిడ్డయ్య, రైతు సంఘం కార్యదర్శి శాంతప్ప, ముని, మల్లేష్, తిమ్మయ్య, నరసయ్య పాల్గొన్నారు.

గోనెగండ్ల: ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అన్ని రకాల విత్తనాలను 90శాతం సబ్సిడీతో పంపిణీ చేయాలని ఏపీ రైతు సంఘం నాయకుడు నాగప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రైతు సంఘం ఆధ్వర్యంలో జూనియర్ అసిస్టెంట్ దినేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, నరసన్న, విష్ణు వర్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

గోనెగండ్ల : గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలని స్థానిక దుర్గా భవాని భారత్ గ్యాస్ మేనేజర్ రవి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్యాస్ వినియోగదారులు గోనెగండ్లలోని తమ కార్యాలయం లేదా గ్యాస్ డెలివరీ బాయ్స్ ఇంటికి వచ్చినప్పుడు ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. గ్యాస్ వినియోగదారుల బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం నుంచి గ్యాస్ రాయితీ పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరి అని తెలియజేశారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ

గోనెగండ్ల : ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసే వంట నిర్వాహకులకు స్థానిక ఎమ్మార్సీ భవనంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ-2 నీలకంఠ మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం పోషకాలతో కూడిన మెనూను అమలు చేస్తోందని, ఆ మేరకు వంట నిర్వహకులు మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో మెనూ ప్రకారం చేయాలన్నారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని చెప్పారు. బడి తెరిచిన రోజు నుంచే పాఠశాలల్లో తప్పనిసరిగా మెనూ పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రహమతుల్లా, సీఆర్పీలు పుల్లన్న, రవి, గోవింద రాజులు, వంట నిర్వహకులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి
నందవరం : ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వాహకులు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలో ఎంఆర్సీ భవనంలో ప్రభుత్వ పాఠశాలలోని అన్ని వంట ఏజెన్సీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనంలో రుచి, శుచి, శుభ్రత తప్పకుండా పాటించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు మెనూ పాటించాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ ప్రసాద్, డీటీపీ శైలజ, సీఆర్పీ ఉరుకుందు తదితరులు పాల్గొన్నారు.



వంటను పరిశీలిస్తున్న అధికారులు

అంత్యక్రియలకు ఆర్థికసాయం

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు గ్రామానికి చెందిన కరి శివమ్మ(48) అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక మృతి చెందింది. వారిది నిరుపేదల కుటుంబం కావడంతో ఆమె అంత్యక్రియల నిమిత్తం ఎమ్మెల్యే వై. బాల నాగిరెడ్డి రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే తరుపున వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ అందజేశారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

ఆదోని టౌన్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి నందమూరి తారక రామారావు అని ఆదోని డాక్టర్ ఎన్‌టీఆర్ సిండికేట్ ఫ్యాన్స్ నాయకులు కుంకనూరు వీరేష్, నవీన్ ప్రశాంత్ అన్నారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని భీమాస్ ఫంక్షన్ హాల్ క్షాయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా బాణా సంచా కాల్చారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనుల పరిశీలన

ఆదోని టౌన్: స్థానిక పాత బస్టాండ్ సర్కిల్‌లో నిర్మితమవుతున్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులను మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఎంఈ చలపతిరావు, డీఈ నాగభూషణంరెడ్డి, ఏఈలు రాజశేఖర్‌రెడ్డి, మంగళవారం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను వారు ఆదేశించారు. అనంతరం రాయ్‌నగర్‌లో మురుగు కాలువలు, పర్వతాపురంలో సామూహిక మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. మురుగు కాలువలు నిండిపోయి దుర్గంధం వెదజల్లుతున్నా ఎందుకు శుభ్రం చేయడం లేదని శానిటేషన్ వర్కర్లపై మండి పడ్డారు.



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, ఎంఈ, డీఈ, ఏఈలు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి





భోజనం తయారీపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ-2 శ్రీనివాసులు, హాజరైన వంట నిర్వాహకులు

ఆదోని సెంట్రల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి-2 శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలకు సంబంధించిన కుక్ కం హెల్పర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం చేయాలన్నారు. రుచికరంగా, పోషక విలువలతో కూడిన భోజనం అందించాలన్నారు. అనంతరం వాటిని ఏ విధంగా తయారు చేయాలో ఐఎఫ్‌పీ ప్యానెల్ ద్వారా చూపించారు. అక్కడే వంట నిర్వాహకుల చేత వంటను తయారు చేయించారు. కార్యక్రమములో సీఆర్‌పీలు బీచ్‌పల్లి, మల్లికార్జున, ఉసేనప్ప, మల్లన్న, నాగవేణి, బీబీ, రాజేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆదోని అర్బన్: మండలంలోని గణేకల్ గ్రామ సమీపంలో మంగళవారం బస్సు ఢీకొన్న ప్రమాదంలో బైకుపై వెళ్తున్న గవిగట్టు గ్రామానికి చెందిన యువకులు నర్సారెడ్డి, శివరామ్ గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు..నర్సారెడ్డి, శివరామ్ పని నిమిత్తం ఆదోనికి వచ్చారు. అనంతరం తిరిగి సొంతూరుకు బైక్‌పై బయలుదేరారు. గణేకల్ గ్రామ సమీపంలో పాండవగల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వీరి బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో వీరి తీవ్ర గాయాలపాలు కావడంతో స్థానికులు ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన పెరగాలి



అవగాహన కరపత్రాలు ప్రదర్శిస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రవీణ్‌కుమార్, వైద్య సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): రుతుక్రమ పరిశుభ్రత పట్ల బాలికలు అవగాహన పెంచుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఎన్‌టీఆర్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని 2013 మే 28న జర్మనికి చెందిన వాష్ యునైటెడ్ అనే ఎన్‌జీఓ ప్రారంభించిందన్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం పీరియడ్ ఫ్రెండ్లీ వరల్డ్ అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెలసరి అనేది సాధారణంగా 9 నుంచి 14 సంవత్సరాల వయస్సు అమ్మాయిల్లో మొదలవుతుందన్నారు. దాదాపుగా ప్రతి నెలా 3 నుంచి 5 రోజుల పాటు రజస్వల అవుతుందన్నారు. ఇది వయస్సు పెరుగుదలలో భాగంగా జరిగే సహజ ప్రక్రియ అని, అమ్మాయిలకు అవగాహన కల్పించి ఆందోళనకు గురిగాకుండా చూడాలని తెలిపారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత మాట్లాడుతూ అమ్మాయిలు నెలసరి సమయంలో చేయాల్సిన విధుల గురించి వివరించారు. ప్రతిరోజూ స్నానం చేయాలని, ప్రతి ఆరు గంటలకు ఒకసారి శానిటరి ప్యాడ్ మార్చుకోవాలని, వాడిన శానిటరి ప్యాడ్‌ను పేపర్లో చుట్టి డస్ట్‌బిన్‌లో వేయాలని, ప్యాడ్ మార్చుకునే ముందు, తర్వాత చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని, వాడిన లోదుస్తులను ఉతికి ఎండలో ఆరబెట్టాలని, పోషకాహారం తీసుకోవాలని, వీలైనంత ఎక్కువగా నీరు తాగాలని, తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ విషయాలపై క్షేత్రస్థాయిలో ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు కిశోరబాలికలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డెమో ప్రమీలాదేవి, హెచ్‌ఈఈఓ శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌బీఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున పాల్గొన్నారు.

పట్టణంలో కార్డెన్ సెర్చ్

ఆదోని అర్బన్: త్రీటౌన్ సీఐ నరసింహరాజు, ఎస్‌ఐ నాగేంద్ర, పోలీసు సిబ్బందితో కలిసి మంగళవారం పట్టణంలోని విజయనగర్ కాలనీ, కొడల్‌పేట ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి రికార్డులు లేని ఒక కారు, ఆరు ఆటోలు, రెండు బొలెరో వాహనాలు, 33 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.



పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

కర్నూలు (లీగల్): భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి పిలుపునిచ్చారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన పర్యావరణ పరిరక్షణపై లోకాదలత్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ వ్యర్థాలు తొలగింపుపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవై మునిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్: ఆటోలో తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ విన్నీలత తెలిపిన వివరాలు.. కర్ణాటక మద్యం తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో సిరుగుప్ప క్రాస్ తనిఖీలు చేపట్టారు. ఆటోలో మద్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. 15 బాక్సుల కర్ణాటక మద్యం (1440 టెట్రా ప్యాకెట్లు), ఆటోను సీజ్ చేసి, నిందితులు ఆదోనికి చెందిన ఫయాజ్, ఆలీపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో సెబ్ ఎస్‌ఐ ఇస్మాయిల్ పాల్గొన్నారు.



మద్యం, ఆటోను చూపుతున్న సెబ్ సీఐ విన్నీలత

పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఆదోని సెంట్రల్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మొదటి రోజు 65 మంది విద్యార్థులు హాజరై తమ విద్యా అర్హతల ధ్రువపత్రాలను పరిశీలించుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సుధాకర్ రెడ్డి తెలిపారు. కౌన్సెలింగ్‌కు వచ్చే విద్యార్థులు ఒరిజినల్ ధ్రువ పత్రాలతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకురావాలన్నారు. పాలీసెట్ హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, ఎస్ఎస్‌సీ మార్క్స్ సర్టిఫికెట్, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్, టీసీతో పాటు ఆన్‌లైన్లో ఫీజు చెల్లించిన రశీదు తీసుకురావాలన్నారు. ఎస్టీ అభ్యర్థులు కర్నూలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, స్పెషల్ క్యాటగిరీ విద్యార్థులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విజయవాడలో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 8121555646 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్య సేవలు

నందవరం : ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటింటికీ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని పీహెచ్‌సీ డాక్టర్ శ్రీలేఖ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మాచాపురం గ్రామ సచివాలయంలో 104 ద్వారా డాక్టర్ గర్భిణులు, వృద్ధులు, బాలింతలకు వైద్య సేవలు అందించారు. ఆమె మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. చికిత్సతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని వివరించారు. బాలింతలు, గర్భిణులకు టీకాలు వేసి, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారంపై సలహాలు, సూచనలు చేశారు. గ్రామంలో 54 మందికి వృద్ధులు, గర్భిణులకు రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.



మాచాపురం సచివాలయంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శ్రీలేఖ



నందవరంలో పత్తి విత్తనాలను నాటుతున్న వ్యవసాయ కూలీలు



నందవరంలో గొర్రుపాస్తున్న రైతన్న

పొలాల్లో సాగు సందడి

- జోరుగా విత్తన పనులు
- వ్యవసాయ పనుల్లో రైతులు, వ్యవసాయ కూలీలు బిజీ

నందవరం : నిన్నటి వరకు వెలవెలబోయిన పొలాల్లో వానల రాకతో సందడి నెలకొంది. ఇటీవల వర్షాలు కురవడంతో విత్తన పనులు జోరుగా సాగుతున్నాయి. రైతన్నలు, వ్యవసాయ కూలీలు విత్తన పనుల్లో బిజీగా ఉన్నారు. మండలంలోని నందవరం, పూలచింత, జోహరాపురం, హాలహర్వి, ముగతి తదితర గ్రామాల్లో విత్తన పనులు జోరందుకున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌కు వర్షాలు అనుకులంగా కురుస్తుడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నది తీర గ్రామాలు, బోరు బావుల దగ్గర రైతులు పత్తి పంటల సాగుకు ఉపక్రమించారు.



ముగతిలో పత్తి విత్తనాలు నాటి చద్దులు ఆరగిస్తున్న కూలీలు